నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మణుగూరుటౌన్, డిసెంబర్ 15: గుట్టమల్లారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా అశోక్‌నగర్, పోలీస్‌స్టేషన్ ఏరియా, పోలీస్ కాలనీ, సింగారం ఏరియా, ఎన్టీఆర్‌నగర్, రిక్షా కాలనీ, కూనవరం, బావికూనవరం, చంద్రబాబునగర్, మొద్దులగూడెం, వెంకటినగర్, తోగ్గూడెం ఏరియాల్లో శనివారం ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు నిలిపివేస్తామని విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 11కేవీ మల్లారం ఫీడర్‌లో లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున రాజీవ్‌గాంధీనగర్, సాయినగర్, పూజారినగర్, టెలిఫోన్ ఎక్సేంజ్ ఏరియా, 220కేవీ సబ్‌స్టేషన్‌రోడ్డు, మణికంఠనగర్, డబుల్‌బెడ్రూం ఏరియా, వాగుమల్లారం, గుట్టమల్లారం, కోర్టుఏరియా, గవర్నమెంటు హాస్పటల్ ఏరియా, లంకమల్లారం, బ్రహ్మంగారిగుట్ట, హనుమాన్‌నగర్, ముత్యాలమ్మనగర్, పద్మగూడెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

పేదలకు సాగుభూమి, ఇళ్లస్థలాలు ఇవ్వాలి

బూర్గంపహాడ్, డిసెంబర్ 15: మండలంలో భూమిలేని నిరుపేదలకు సాగుభూమి, ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ (న్యూడెమెక్రసీ) ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ తిరుమలాచారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు కనీసం ఒక కుంట భూమి కూడాలేదని, ఉండగానికి ఇంటి స్థలం కూడా లేని పరిస్థితి ఉందని, కొందరికి గోదావరి వస్తే ఇళ్లు మునిగే పరిస్థితి ఉందని ప్రభుత్వం స్పందించి భూమిలేని వారికి సాగుభూమి, ఇళ్లు లేని వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఆ వినతిలో కోరారు. కార్యక్రమంలో నాయకులు ముసలి సతీశ్, వైఎస్ రెడ్డి, వీరమల్ల ఉమ, నాయకులు ముత్యాల సత్యనారాయణ, సిరిగిడి నరేశ్, రవి, మనోజ్ పాల్గొన్నారు.

జాతీయ కార్మిక సంఘాల మాటలు నమ్మొద్దు

మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు వూకంటి ప్రభాకర్‌రావు

గేట్‌మీటింగ్‌లో కార్మికులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రావు

మణుగూరుటౌన్, డిసెంబర్ 15: జాతీయ కార్మిక సంఘాల మాటలు వింటే కోరి కష్టాలు తెచ్చుకున్నట్లేనని, అలవికాని హామీలు, మోసపూరిత మాటలు తప్ప కార్మికులకు ఒరగ బెట్టిందేమీలేదని టీబీజీకేఎస్ మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షులు వూకంటి ప్రభాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఓసీ-2లో పిట్ సెక్రటరీ అశోక్ అధ్యక్షతన గేట్ మీటింగ్‌లో యన కార్మికులతో మాట్లాడారు. నిరంతరం కార్మికులకు అండగా ఉంటూ ప్రతి కార్మిక సమస్య పరిష్కారానికి కృషిచేసిన టీబీజీకేఎస్‌ను ప్రతిఒక్కరు ఆదరించాలన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ హయాంలో పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు, అనేక హక్కులను టీబీజీకేఎస్ హయాంలో సాధించడం జరిగిందన్నారు. కరెంటు చార్జీల రద్దు, మ్యాచింగ్ గ్రాంట్ పదిరెట్లు పెంపు, 32శాతం లాభాలవాటా, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వయోపరిమితి పెంచడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కార్మికుల పక్షాన నిలిచి ప్రభుత్వంతో కొట్లాడైనా సాధించిన హక్కులు కాపాడుకునేందుకు, కొత్త హక్కులు సాధించుకునేందుకు టీబీజీకేఎస్‌ను బాణం గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా గడిచిన 9 సంవత్సరాల కాలంలో 64పైగా డిమాండ్స్ సాధించి చరిత్ర సృష్టించడం జరిగిందన్నారు. టీబీజీకేఎస్‌పై విషప్రచారం చేస్తూ కార్మికులను అయోమయానికి గురి చేస్తున్నాయన్నారు. పెర్క్స్‌పై అలవెన్సు, కార్మికులకు విధిస్తున్న ఇన్‌కంటాక్స్‌ను తిరిగి చెల్లించే విధంగా కృషిచేస్తామని, వీటితో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు, హక్కులు సాధించేందుకు కార్మికపక్షాన టీబీజీకేఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ అబ్దుల్ రవూఫ్, వీరభద్రయ్య, సీహెచ్.వెంకటేశ్వరరెడ్డి, కాపా శివాజీ, ఎస్‌వీఎస్ఎన్.వర్మ, అశోక్, బుద్ద వెంకటేశ్వర్లు, శంకర్, కాంతారావు, కేవీ.రమణ, కృష్ణ, భద్రయ్య, హనుమంతరావు, ముజాహిద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు.. వెంటనే వదిలి పెట్టారు

పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

చర్ల, డిసెంబరు 15: అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న దళారులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌తో మాట్లాడడంతో పట్టుకున్న ట్రాక్టర్లపై ఎలాంటి కేసులు కానీ, జరిమానా కానీ కట్టకుండా తహసీల్దార్ వదిలిపెట్టిన ఘటన చర్ల మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు రవాణ చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను చర్లలో అధికారులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న ఇసుక ట్రాక్టర్ యాజమానులు తహసీల్దార్ కార్యాలయానికి చెరుకుని ట్రాక్టర్లను వదిలి పెట్టాలని తహసీల్దార్‌ను కోరారు. ఇందుకు తహసీల్దార్ ట్రాక్టర్లపై కానీ, యజమానులపై కానీ ఎలాంటి కేసులు కానీ, జరిమానాకాని విధించకుండా విడిచి పెట్టారు. ఈ విషయాన్ని తహసీల్దార్ రామకృష్ణను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా ఇసుకను తరలించడం మొదటి సారి కావడంతో హెచ్చరించి వదిలి పెట్టామని చెప్పారు. ఇకనుంచి ఇసుక, మట్టి గ్రావెల్ ఎటువంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

మావోయిస్టు కొరియర్ల అరెస్టు

మాట్లాడుతున్న సీఐ రాజగోపాల్

చర్ల, డిసెంబరు 15: మావోయిస్టు పార్టీకి చెందిన కొరియర్, మిలీషియా సభ్యుడిని చర్ల పోలీసులు గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. చర్ల సీఐ రాజగోపాల్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ కొత్తగూడెం గ్రామ పంచాయతీ దానవాయిపేట గ్రామ శివారులో చర్ల, కొత్తగూడెం ప్రత్యేక పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఆదివాసీ గ్రామం బూరుగుపాడు గ్రామం వెళ్ళేదారిలో మావోయిస్టు పార్టీ కొరియర్ బూరుగుపాడు గ్రామానికి చెందిన సోడి దీపక్ అలియాస్ మాడయ్య, బీజాపూర్ జిల్లా పామేడు పంచాయతీ మంగల్ తురా గ్రామానికి చెందిన కుంజా ఇడుమా అలియాస్ మూయా తారసపడ్డారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి 10 మీటర్ల అలివ్‌గ్రీన్ క్లాత్,4జతల చెప్పులు, మందులు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ రాజగోపాల్ తెలిపారు.

మంత్రి పొంగులేటిని కలిసిన రెడ్డి ప్రతినిధులు

మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెడ్డి సమాఖ్య ప్రతినిధులు

మణుగూరుటౌన్, డిసెంబర్ 15: మణుగూరు రెడ్డి సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు నాసిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో రెడ్డి సమాఖ్య ప్రతినిధులు హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మణుగూరులో నిర్వహించనున్న రెడ్డి సమాఖ్య వనభోజన మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. పొంగులేటిని కలిసిన వారిలో సాసిరెడ్డి సాంబశివరెడ్డి, సామా శ్రీనివాసరెడ్డి, సానికొమ్ము వెంకటరెడ్డి, గాయం అవినాశ్‌రెడ్డి, బద్దం శ్రీనివాసరెడ్డి, సురేందర్‌రెడ్డి, అంబటి నాగిరెడ్డి, శ్యామల ఆదినారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, ఆదిరెడ్డి, మాధవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఉన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

కరకగూడెం, డిసెంబర్ 15: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య బృందం సభ్యులు అన్నారు. శుక్రవారం కరకగూడెం పీహెచ్‌సీ పరిధిలోని నాలుగు ఆరోగ్య ఉప కేంద్రాల్లో అనుమానిత కుష్ఠు లక్షణాలు కలిగిన వ్యక్తులను పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు నాలుగు బృందలుగా విడిపోయి ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో అనుమానిత వ్యక్తులకు పరీక్షలు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ వ్యాధిని 6 నుంచి 12 నెలల కాలంలో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందజేస్తారని అన్నారు. అనంతరం చిరుమళ్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు దుర్గాభవాని, రమాదేవి, శ్రీను, సత్యనారాయణ, ముత్యాలరావు, కృష్ణమూర్తి, మోహన్, వెంకటేశ్వర్లు, గన్యా, ఏఎన్ఎంలు, హైల్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

సారపాక, డిసెంబర్ 15: ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి, వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని, కఠినంగా శిక్షిస్తామని ఎస్సై రాజ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పగలు, రాత్రి తేడాలేకుండా అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా గోదావరి నుంచి, కిన్నెరసాని వాగుల నుంచి ఇసుక రవాణాను చేస్తున్నారని అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పండుగ పేరుతో కోడిపందాలు, పేకాట ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బిల్డింగ్‌పై నుంచి పడి చిన్నారి మృతి

భద్రాచలం, డిసెంబర్ 15: పట్టణంలోని మేదరు బజారుకు చెందిన అంజలి (3) అనే చిన్నారి భవనంపై నుంచి పడి మృతిచెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. మేదరు బజారులో నివాసముంటున్న రాజస్తానీ కుటుంబానికి చెందిన బాలిక గురువారం రాత్రి రెండో అంతస్తులో గోడ పక్కన ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా అప్పటికే మృతి చెందింది.

రెండు ద్విచక్ర వాహనాల చోరీ

భద్రాచలం, డిసెంబర్ 15ః పట్టణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో యమహా బైక్, ఐటీడీఏ రోడ్డులోని రూపా స్కూల్ సమీపంలో ఉన్న ఓ సూపర్ మార్కెట్ వద్ద పార్క్ చేసి ఉన్న పల్సర్ బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. వారిని ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేదుకు హెల్మెట్‌లు ధరించారు. రెండు బైక్‌లను పురుషోత్తపట్నం మీదుగా ఆంధ్రాలోకి తీసుకెళ్లారు.

బీటీపీఎస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న బీటీపీఎస్ సీఈ దంపతులు

మణుగూరుటౌన్, డిసెంబర్ 15: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలను బీటీపీఎస్ సీఈ బీ బిచ్చన్న దంపతులు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి మాట్లాడారు. అన్ని మతాల సారం ఒక్కటేనన్నారు. దేశంలో ఎన్ని కులాలు, మతాలు ఉన్నా భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించడం ద్వారా భారతీయులందరూ ఏకతాటిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఏడీ పార్వతి, డీఎస్‌సీ డి.శ్రీనివాస్, సివిల్-1 ఎస్ఈ డీవీ రమణమూర్తి, సివిల్-2 ఎస్ఈ రాంప్రసాద్, స్టేజ్-2 ఎస్ఈ రమేశ్, స్టేజ్-1 ఎస్ఈ రమేశ్‌బాబు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, డీఈలు ఏడీఏలు, బీహెచ్ఈఎల్ అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల మ్యానిఫెస్టో అమలుచేయాలి

అశ్వాపురం, డిసెంబర్ 15: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలంగాణ గౌడ సంఘం మండల అధ్యక్షుడు అండెం గంగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన అశ్వాపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనగాం జిల్లాకు సర్దార్ సర్వాయిపాపన్న జిల్లాగా నామకరణం చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే గౌడన్నలకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలని, జీవో 560 ప్రకారం ప్రతి సొసైటీకి తాటి, ఈతవనాలు పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, బెల్టుషాపులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

భద్రాచలం, డిసెంబర్ 15: ముంబైలో ఈ నెల 21 నుంచి 25వరకు జరిగే జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిమ్ కోచ్ జీవీ రామిరెడ్డి తెలిపారు. నవంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఈ ముగ్గురు క్రీడాకారులకు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అధికారులు ఎంపిక చేశారన్నారు. 74కిలోల విభాగంలో మామిడి భూమిక, 59కిలోల విభాగంలో సరియం భరత్, 105కిలోల విభాగంలో ఐటీసీ పీఎస్‌పీడీ విశ్రాంత ఉద్యోగి గాలి రామ్మోహనరావు ఎంపికయ్యారు. వీరిని పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణ ప్రముఖులు, గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు బోగాల శ్రీనివాసరెడ్డి, జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్ మహంతి వెంకటకృష్ణ, గుగులోత్ శోభన్ నాయక్, లయన్ గాదె మాధవరెడ్డి అభినందించారు.

నెహ్రూ కప్‌లో క్రికెట్ పోటీల్లో యువత భాగస్వాములు కావాలి

భద్రాచలం, డిసెంబర్ 15: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న 29వ నెహ్రూ కప్ అంతర్రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో యువత భాగస్వామ్యం కావాలని నిర్వాహకులు దుర్గాఅశోక్, బాలయోగి పిలుపునిచ్చారు. శుక్రవారం క్రీడా మైదానంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 26,27 రెండు రోజులు స్నేహ పూర్వక మ్యాచులు జరుగుతాయని, 28 నుంచి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడా జట్లతో పోటీలు జరుగుతాయని వారు తెలిపారు. టోర్నమెంట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో నెహ్రూకప్ క్రికెట్ టోర్నమెంట్ అధ్యక్షుడు అట్లూరి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మడిపల్లి నాగార్జున, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుమ్మూలూరి శ్రీనివాస్, కోశాధికారి సదానందం పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు వర్ధంతి

అశ్వాపురం, డిసెంబర్ 15: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని అశ్వాపురంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్దేశ్యంతో 58 రోజులు నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు అని కొనియాడారు. కార్యక్రమంలో శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు స్వరాజ్‌రావు, సెక్రటరీ రేపాక వెంకటరమణ, ట్రెజరర్ కే సందీప్, కొండె సత్యం, దోసపాటి చింటు, వీరభద్రం, నర్సింహారావు, లక్ష్మీనారాయణ స్వామి, సురేశ్, రాజేశ్, ధనుంజయ్, రవి పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరుటౌన్, డిసెంబర్ 15: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్య కాలనీలో లయన్స్‌క్లబ్ సభ్యులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు, సభ్యులు అడబాల నాగేశ్వరరావు, భాగం రమేశ్, ఆర్యవైశ్యసంఘం మాజీ అధ్యక్షుడు నర్సింహారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

దుమ్ముగూడెం, డిసెంబర్ 15: దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలోని ఆర్లగూడెం ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యుడు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆరోగ్య శిబిరం నిర్వహించి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు పరిశీలించి విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తడిదుస్తులు వాడొద్దని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని సూచించారు. శిబిరంలో ఆరోగ్య సిబ్బంది గంగాధర్, గంగమ్మ, లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.